www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 28 డిసెంబరు 2023

గోనె సంచులివ్వండి

కౌలు రైతుల ఆందోళన

పోడూరు:వారం రోజులైనా రైతులకు గోనె సంచులివ్వడం లేదని గుమ్ములూరు రైతు భరోసా కేంద్రం వద్ద కౌలు రైతు సంఘం నేతలు బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు మాట్లాడుతూ ఇప్పటికే నానా కష్టాలు పడి సార్వా పంట మాసూళ్లు చేసిన రైతులకు ప్రభుత్వం కనీసం ధాన్యం సంచులు ఇవ్వలేకపోవడం దారుణమన్నారు. తుపాను కారణంగా కొంత పంట దెబ్బతిందని, కనీసం మిగతా పంటనైనా కౌలు రైతులు సక్రమంగా అమ్ముకునే పరిస్థితి లేదని అన్నారు. తక్షణం సంచులు అందించాలని తహశీల్దార్‌ను కోరారు. కార్యక్రమంలో కౌలు రైతులు, రైతులు తోట సత్యనారాయణ, కోనాల లక్ష్మణరావు, కడలి నర్సింహస్వామి, కుడిపూడి ఏసుబాబు, ఉల్లంపర్తి సతీష్, బి.ఏసుబాబు పాల్గొన్నారు.

'సాగు'కు రుణమేదీ..!

'సాగు చేసే రైతును పక్కన పెట్టేశారు. ఆరుగాలం శ్రమించే అన్నదాతకు ఆసరా లేకుండాపోయింది. గడిచిన రబీ, ప్రస్తుత ఖరీఫ్‌లోనూ వర్షాలకు పంట నష్టపోయిన కౌలురైతులకు ప్రభుత్వ అండ లేకుండాపోయింది. సాగు చేసే రైతులకు పంట రుణాలు కూడా ఇవ్వని దుస్థితి నెలకొంది. 2023-24లో రెండు జిల్లాల్లోనూ కౌలు రైతులకు ఇచ్చిన రుణాలు, వ్యవసాయ రుణ ప్రణాళికకు ఏమాత్రం సంబంధం లేకుండా పోయింది. రబీలోనైనా పంట రుణాలిచ్చి ఆదుకోవాలంటూ కౌలురైతులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

- కౌలు రైతులకు రుణాల మంజూరులో తీవ్ర నిర్లక్ష్యం
- రెండు జిల్లాల వ్యవసాయ రుణ ప్రణాళిక సుమారు రూ.8 వేల కోట్లు
- 2023-24లో మంజూరు చేసిన రుణం రూ.424 కోట్లే
- 3 లక్షల మంది కౌలు రైతులుండగా లక్షా 46 వేల మందికే కౌలు కార్డులు
- కౌలు కార్డుదారుల్లోనూ సగం మందికే రుణం
- రబీ సాగులోనైనా రుణాలివ్వాలని కౌలురైతుల వేడుకోలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో మూడు లక్షల మంది వరకూ కౌలు రైతులు ఉన్నట్లు గతంలో అధికారులు రూపొందించిన లెక్కలే చెబుతున్నాయి. రెండు జిల్లాల పరిధిలోని వ్యవసాయ సాగులో 70 శాతం కౌలురైతులే చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లా వ్యవసాయ సాగులో కీలక పాత్ర పోషిస్తున్న కౌలురైతులను మాత్రం ప్రభుత్వం పూర్తిగా పక్కన పెట్టేసింది. బ్యాంకుల నుంచి పంట రుణాల మంజూరులో ప్రభుత్వం తీవ్రంగా విఫలమవుతోంది. బ్యాంకర్ల ప్రతి సమావేశంలో కౌలురైతులకు విరివిగా పంట రుణాలు ఇవ్వాలంటూ ప్రకటనలతోనే సరిపెడుతున్నారు. వాస్తవ పరిస్థితి మాత్రం పూర్తి విరుద్ధంగా ఉంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో పశ్చిమగోదావరి జిల్లాలో 89 వేల మంది కౌలురైతులకు సిసిఆర్‌సి (రుణార్హత కార్డులు) మంజూరు చేశారు. ఇప్పటి వరకూ 40 వేల మంది సిసిఆర్ కార్డుదారులకు రూ.297 కోట్లు రుణం మంజూరు చేసినట్లు లెక్కలు చెబుతున్నాయి. ఏలూరు జిల్లాలో 57 వేల వరకూ సిసిఆర్‌సి కార్డులు మంజూరు చేశారు. రుణాల మంజూరు మాత్రం 32,948 మంది కౌలుకార్డుదారులకు రూ.127 కోట్లు ఇచ్చినట్లు లెక్కలు చెబుతున్నాయి. రెండు జిల్లాలవ్యాప్తంగా మూడు లక్షల మంది వరకూ కౌలుదారులు ఉండగా సిసిఆర్‌సి అందుకున్న రైతులు లక్షా 46 వేలు మాత్రమే. దాదాపు మరో లక్షా 50 వేల మందికి కౌలుకార్డులు అందనే లేదు. ఈ ఏడాది లక్షా 46 వేల మందికి కౌలుకార్డులు ఇచ్చినప్పటికీ రుణాలు అందుకున్న రైతులు మాత్రం 73 వేల మంది మాత్రమే. అదీ రెండు జిల్లాల్లోనూ కలిపి రూ.424 కోట్లు మాత్రమే. రెండు జిల్లాల వ్యవసాయ రుణ ప్రణాళిక దాదాపు రూ.ఎనిమిది వేల కోట్లు ఉన్నట్లు తెలుస్తోంది. అందులో కౌలురైతులకు పంట రుణాల కింద మంజూరు చేసిన రుణం ఒక్క శాతం కూడా లేకుండాపోయింది. కౌలుకార్డులు అందుకున్న రైతుల్లోనూ సగం మందికి పంటరుణాలు అందనేలేదు. గడిచిన రబీ, ప్రస్తుత ఖరీఫ్‌లోనూ వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోయారు. ముఖ్యంగా కౌలురైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఖర్చులు పెరిగిపోయి తీవ్ర నష్టాలను చవిచూశారు. సాగు చేస్తున్న కౌలురైతులకు మాత్రం ప్రభుత్వం పంటరుణాలు ఇవ్వడం లేదు. సాగు చేయని భూయజమానులకు పంటరుణాలు ఇస్తున్న పరిస్థితి ఉంది.

పంట నష్ట పరిహారం, బీమా సైతం భూయజమానికే

దెబ్బతిన్న పంటలకు సంబంధించిన నష్ట పరిహారం, బీమా సైతం కౌలురైతులకు అందడం లేదు. భూయజమాని ఖాతాలోకే చేరుతున్నాయి. ఇ-క్రాప్ ఆధారంగా పంటనష్టం నమోదు చేసిన పరిస్థితి నెలకొంది. ఇ-క్రాప్‌లో భూయజమానికి పేర్లే ఉన్నాయి. దీంతో పంట నష్టపరిహారం సైతం భూయజమానికే వెళ్తోంది. బ్యాంకులో పంటరుణం తీసుకున్న రైతుకే బీమా పరిహారం చేరుతోంది. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల కారణంగా కౌలురైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పంట నష్టం, బీమాపరిహారంతోపాటు రబీలోనైనా పంటరుణాలు అందించి ఆదుకోవాలని కౌలురైతులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలి : కలెక్టర్

అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ముఖ్యమంత్రి బహిరంగ సభకు విచ్చేసే ప్రజలకు ఎటు వంటి ఇబ్బందులు తలెత్తకుండా పగడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. సిఎం ఈ నెల 29వ తేదీ శుక్రవారం జిల్లా పర్యటన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో జెసి ఎస్.రామ్‌సుందర్ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సభా వేదిక ప్రాంతంలో, బస్సుల్లో అల్పాహారం, తాగునీటి ఏర్పాట్లు చేయాలన్నారు. అవసరమైన చోట బయో టాయిలెట్లు సిద్ధం చేయాలన్నారు. సభాస్థలికి చేరే రూటు మ్యాప్‌లు అందరికీ తెలిసేలా ప్రధాన కూడళ్లలో ప్రదర్శన చేయాలన్నారు. కార్యక్రమం జరిగే ప్రదేశంలో అంబులెన్స్ సిద్ధంగా ఉంచాలని, మందులు, వైద్యాధికారులు, సిబ్బందితో పబ్లిక్ మీటింగ్‌కు తగ్గట్లుగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఒ బి.శివనారాయణ రెడ్డి, ఆర్‌డిఒలు కె.శ్రీనివాసులు రాజు, ట్రెయినీ డిప్యూటీ కలెక్టర్ కె.సంగీత్ మాధుర్, అధికారులు పాల్గొన్నారు.

కొనసాగిన మున్సిపల్ కార్మికుల సమ్మె

తాడేపల్లిగూడెం : సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులపై నిర్బంధాన్ని విడనాడి వారి సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మున్సిపల్ కార్మికుల సమ్మె రెండో రోజు బుధవారం కొనసాగింది. ఈ మేరకు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు పనిముట్లతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి గోపాలన్ మాట్లాడారు. జగన్మోహన్ రెడ్డి మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలు, మరోపక్క చాలీచాలని జీతాలతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణాల పరిశుభ్రంగా ఉంచడంలో మున్సిపల్ కార్మికులు తీవ్రంగా శ్రమిస్తున్నారని తెలిపారు. వారికి కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో సిఐటియు, ఎఐటియు నాయకులు బి.వాసుదేవరావు, ధనాల నాని, కె.సంతిబాబు, నీలాపు రాజు, ఎస్‌కె.నాగూర్ విశ్వనాథం పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్యాలయం వద్ద మహాత్మా గాంధీ విగ్రహం వద్ద సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె బుధవారం రెండో రోజుకు చేరింది. సమ్మెకు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కర్రి నాగేశ్వరరావు హాజరై మాట్లాడారు. మున్సిపల్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో రానున్న కాలంలో సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రెండో రోజు సమ్మెలో భాగంగా మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎస్.సతీష్, ధనాల రాజు, టి.బాబు, కె.దయామణి, ధనరాజు నాయకత్వం వహించారు.

తణుకురూరల్ : మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు కార్మికుల సమ్మెను కొనసాగిస్తామని సిఐటియు జిల్లా కార్యదర్శి పి.వి.ప్రతాప్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రెండో రోజు రాష్ట్రపతి రోడ్డులో మున్సిపల్ కార్యాలయం వద్ద నుంచి నరేంద్ర సెంటర్ వరకూ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్, యూనియన్ గౌరవాధ్యక్షులు కామన మునిస్వామి మాట్లాడారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నీలాపు ఆదినారాయణ, అజ్జి కృష్ణబాబు, ఎం.మండయ్య, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

ఎస్ఎస్ఎ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

భీమవరం రూరల్ : సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సంఘం జెఎసి జిల్లా అధ్యక్షులు షేక్ బావాజీ ప్రభుత్వాన్ని కోరారు. సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న వివిధ శాఖల కాంట్రాక్టు ఉద్యోగులు తమను రెగ్యులర్ చేయాలని హెచ్ఆర్, డిఎ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన సమ్మె బుధవారానికి ఎనిమిదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా బావాజీ మాట్లాడుతూ ఏళ్ల తరబడి చేస్తున్నప్పటికీ తమకు ప్రభుత్వం సరైన గుర్తింపు ఇవ్వడం లేదన్నారు. విద్యావవస్థలో ఎన్నో కీలకమైన పనులు ప్రభుత్వం తమ చేత చేయిస్తోందన్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెసెంజర్ జనార్ధన్, అకౌంటెంట్ కిరోషా, ఇంజినీర్ వెంకటేశ్వరరావు, డేటా ఎంట్రీ మోహన్, పిఇటి శ్రీను, మెసెంజర్ బాబు, మధు పాల్గొన్నారు.

సమ్మెలో మాట్లాడుతున్న షేక్ బావాజీ

వెనుకంజ వేయం

ఎంఎల్‌ఎల ఇళ్లు, క్యాంపు కార్యాలయాల ముట్టడి

16వ రోజుకు చేరిన అంగన్‌వాడీల సమ్మె

తణుకులో మంత్రి కారుమూరి ఇంటిని ముట్టడించి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకపోతే ఎన్ని రోజులైనా సమ్మె కొనసాగిస్తామని, వెనకంజ వేసేది లేదని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు కళ్యాణి, హసీనా తెలిపారు. సిఐటియు ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె 16వ రోజు బుధవారం కొనసాగింది. ఈ సందర్భంగా కళ్యాణి, హసీనా మాట్లాడారు. కోనసీమ జిల్లా ముమ్మిడివరంలో అంగన్‌వాడీ టీచర్ లక్ష్మమ్మ రాష్ట్ర ప్రభుత్వం సమస్యలు పరిష్కరించలేదని ఆందోళనకు గురై మృతి చెందింది. ఈ నేపథ్యంలో లక్ష్మమ్మకు అంగన్‌వాడీలు నివాళులర్పించారు. అనంతరం ఎంఎల్‌ఎ కార్యాలయానికి వెళ్లి వైసిపి పట్టణ అధ్యక్షులు తోట భోగయ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు జి.విజయలక్ష్మి, మేరీ గ్రేస్, దుర్గ, వెంకటలక్ష్మి, గణేష్ పాల్గొన్నారు.

మొగల్తూరు : అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోరుతూ చేపట్టిన సమ్మె 16వ రోజు బుధవారం కొనసాగింది. సమ్మెలో భాగంగా నరసాపురంలోని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాద్ రాజు ఇంటి ముట్టడి కార్యక్రమానికి మొగల్తూరు నుంచి అంగన్‌వాడీలు అధిక సంఖ్యలో భారీ ప్రదర్శనగా వెళ్లారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు పెద్దింట్లు, సారమ్మ, సీత, నాగలక్ష్మి, రేఖ శాంభవి ఉన్నారు.

తాడేపల్లిగూడెం : సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన అంగన్‌వాడీల దీక్షలు 16వ రోజుకు చేరాయి. తహశీల్దార్ కార్యాలయం నుంచి మంత్రి కొట్టు సత్యనారాయణ ఇంటి వరకూ అంగన్‌వాడీలు ర్యాలీగా వెళ్లారు. అక్కడ మంత్రి లేకపోవడంతో పట్టణ సిఐ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు దీన స్వరూపరాణి మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ, యడవల్లి వెంకట దుర్గారావు, ప్రభారాణి, కనక మహాలక్ష్మి, వరలక్ష్మి, ప్రసన్న, గాయత్రి, వీరమ్మ పాల్గొన్నారు. అలాగే అంగన్‌వాడీల సమ్మెకు తాడేపల్లిగూడెం తాలూకా రైల్వే గూడ్స్ షెడ్ వర్కర్స్ యూనియన్ మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు సత్తి కోదండరామిరెడ్డి, కార్యదర్శి చెర్ల పుల్లారెడ్డి, ఉపాధ్యక్షులు కరిసాయి రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్.రంగారావు, కర్రి సుబ్బిరెడ్డి, ఆకుల నారాయణ, అడపా ఆంజనేయులు పాల్గొన్నారు.

గణపవరం : సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటం కొనసాగిస్తామని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణారావు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కాటుక ఝాన్సీలక్ష్మి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమ్మెలో భాగంగా 16వ రోజు అంగన్‌వాడీలు ఉంగుటూరు ఎంఎల్‌ఎ పుప్పాల వాసుబాబు క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించి ధర్నా నిర్వహించారు. తొలుత గణపవరం సిఐటియు కార్యాలయానికి గణపవరం, నిడమర్రు, ఉంగుటూరు, భీమడోలు మండలాల నుంచి అధిక సంఖ్యలో అంగన్‌వాడీలు ఉదయం 9 గంటలకు చేరుకున్నారు. అనంతరం భువనపల్లిలోని ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయానికి పెద్ద ప్రదర్శనగా వెళ్లి అక్కడ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు స్వర్ణకుమారి అధ్యక్షత వహించారు. సిఐటియు మండల కార్యదర్శి ఎం.పెంటారావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణారావు, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కాటుక ఝాన్సీ మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ నాయకులు వై.సుజాత, బి.రామకోటి, జె.రత్నకుమారి, కె.జయమ్మ, ఎన్.పార్వతి, ఎస్.ధనలక్ష్మి పాల్గొన్నారు. ఎంఎల్‌ఎ వాసు బాబుకు వినతిపత్రం అందజేస్తామని రెండు రోజుల ముందు సమాచారం అందించినా ఆయన అందుబాటులో లేని రమణారావు తెలిపారు. ధర్నా అనంతరం వినతిపత్రాన్ని క్యాంపు కార్యాలయ సిబ్బందికి అందజేసినట్లు చెప్పారు

అత్తిలిలో..

భీమవరంలో..

గణపవరంలో..

తాడేపల్లిగూడెంలో సిఐకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

కాళ్ల : అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మెలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు గొర్ల రామకృష్ణ, కార్యదర్శి మండా సూరిబాబు, అంగన్‌వాడీ సెక్టార్ లీడర్స్ దావులూరి మార్తమ్మ, యడవల్లి చంద్రావతి, ఝాన్సీ లక్ష్మీబాయి, కమల, రాజమణి, ఝాన్సీ, టీచర్స్ అండ్ హెల్పర్స్ పాల్గొన్నారు.

ఆచంట : అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని సిఐటియు మండల కార్యదర్శి వర్ధిపర్తి అంజిబాబు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆచంట, పెనుగొండ, పోడూరు మండలాలకు చెందిన అంగన్‌వాడీలు ఆటోలు, బస్సుల్లో పోడూరు మండలం తూర్పుపాలెంలోని ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు క్యాంపు కార్యాలయానికి వెళ్లి అక్కడ బైఠాయించి నిరసన తెలిపారు. ఎంఎల్‌ఎ అందుబాటులో లేకపోవడంతో సుమారు అరగంట సేపు నిరసన తెలిపారు. ఎంఎల్‌ఎ పిఎ సురేష్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు అధ్యక్షులు బి.వెంకట్రావు, నాగిశెట్టి గంగారావు, పిల్లి ప్రసాద్, నేతలు కానూరు తులసి, వైట్ల ఉషారాణి, రాయుడు కుమారి, జక్కం శెట్టి ఉమాదేవి పాల్గొన్నారు. సమ్మెకు కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి వద్దిపర్తి అంజిబాబు, అంగన్‌వాడీలు వైట్ల ఉషారాణి, మైలే విజయలక్ష్మి, మహేశ్వరి, జి.కమల, పద్మ, అల్లం సత్యవతి, సువర్ణ, మల్లేశ్వరి, గౌరీశ్వరి, నాగలక్ష్మి, సుజాత, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ఆచంట (పెనుమంట్ర) : అంగన్‌వాడీ కార్యకర్తల రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. సిఐటియు మండల కార్యదర్శి కోడే శ్రీనివాస ప్రసాద్ ఆధ్వర్యంలో చెవిలో పువ్వు పెట్టుకుని, ఒంటి కాలి మీద నిలబడి నిరసన తెలిపారు. కార్యక్రమంలో పెనుమంట్ర, ఆలమూరు, మార్టేరు సెక్టార్‌కు సంబంధించి సాయి మహాలక్ష్మి, మౌనిక, సరస్వతి పాల్గొన్నారు.

తణుకు రూరల్ : అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోసం జనవరి 3వ తేదీన కలెక్టర్ కార్యాలయాలను ముట్టడి ద్వారా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ అన్నారు. కోర్టు సెంటర్‌లో తణుకు, ఇరగవరం, అత్తిలి మండలాల్లోని అంగన్‌వాడీలు మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఇంటిని ముట్టడించి ఆయనకు వినతిపత్రం అందజేశారు. మంత్రి కారుమూరి మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు. జిల్లా శ్రామిక మహిళా నాయకులు అడ్డగర్ల అజయ కుమారి పట్ల మంత్రి అనుచిత వ్యాఖ్యలు, ఏకవచనంతో మాట్లాడడాన్ని సిఐటియు జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని ప్రతాప్ అన్నారు. అనంతరం కోర్టు వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు అడ్డగర్ల అజయ కుమారి, గార రంగారావు, కనక దుర్గ, వసంత కుమారి, మణి మాలతి, ప్రమీల, మధుషీల, రాజకుమారి, రజని, ధనలక్ష్మి పాల్గొన్నారు.

పోడూరు : అంగన్‌వాడీల దీక్షలు కొనసాగాయి. ఈ దీక్షలకు విఆర్‌ఎల సంఘం నేతలు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ లీడర్ పీతల రాజమణి, గ్రామ సేవకుల సంఘం మండల అధ్యక్షుడు బెల్లాన్ని ప్రకాష్‌రావు, సిఐటియు జిల్లా కౌన్సిల్ సభ్యులు పిల్లి.ప్రసాద్, బొంతు శ్రీను, బూరాబత్తుల వెంకట్రావు, జె.ఉమాదేవి, రాయుడు కుమారి పాల్గొన్నారు.

పెనుగొండ : అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు మండల అధ్యక్షుడు నాగిశెట్టి గంగారావు అన్నారు. ఈ సందర్భంగా రంగారావు, అంగన్‌వాడీ జిల్లా నాయకురాలు కె.తులసి మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్ల సిద్ధాంతం సెక్టార్ నాయకురాలు పిడి.పరమేశ్వరి, ఎల్.ఉషశ్రీ, హైమ, శ్రీదేవి, కెయుఎం.భవాని, నాగలక్ష్మి, ఉందుర్తి దుర్గ, జి నాగలక్ష్మి పాల్గొన్నారు.

పాలకొల్లు : తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు చేపట్టిన దీక్షలు కొనసాగాయి. ఈ మేరకు వైసిపి పాలకొల్లు ఇన్‌ఛార్జి గుడాల గోపి కార్యాలయాన్ని అంగన్‌వాడీలు ముట్టడించారు. అయితే ఆయన భీమవరంలో ఉండడంతో ఆయన పిఎ.ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆటపాటలతో నిరసన

అంగన్‌వాడీల స్థితి గతులపై ప్రజాశక్తి ప్రత్యేక సంచికలో ప్రచురితమైన పాటను అంగన్‌వాడీలు ప్రాక్టీస్ చేసి పాలకొల్లు తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆట పాటలతో అలరించారు. నోమి నోమన్నాల తుమ్మేతో.. నోమన్నలల్లార తుమ్మేతా.. అమ్మ గైరమ్మా తుమ్మేతో.. మొర ఆలకించమ్మా తుమ్మేతా.. జగనన్నకీ చెప్పి తుమ్మేతో.. ఈ తగువు తీర్చమ్మ తుమ్మేతా అంటూ అంగన్‌వాడీలు ఆడిపాడారు. ఈ పాటను అంగన్ వాడీల నేత నాగలక్ష్మి ఆధ్వర్యంలో ఎం.శ్రీదేవి, బి.నాగలక్ష్మి, పి.పద్మ, ఎంఎ.నర్సమ్మ పాల్గొన్నారు.

అత్తిలి : అంగన్‌వాడీలు బుధవారం బుర్రకథ రూపంలో పాటలు పాడి వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు కేతా గోపాలన్, సిఐటియు సంఘం నాయకులు కర్రి ధర్మేంద్ర, మాధవి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నరసాపురం టౌన్ : అంగన్‌వాడీల సమ్మె 16వ రోజుకు చేరుకుంది. బుధవారం అంబేద్కర్ సెంటర్ నుంచి పురపాలక కార్యాలయం వరకూ ర్యాలీగా బయలుదేరి అక్కడ బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాద్‌రాజుకు వినతిపత్రం సమర్పించారు. సమ్మెకు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కవురు పెద్దిరాజు, మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు పాలూరి బాబ్జి, సిఐటియు పట్టణ కార్యదర్శి పొన్నాడ రాము సంఘీభావం తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి జల్లి రామ్మోహన్ రావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ, డి.విజయలక్ష్మి, కె.భోగేశ్వరి, జి.శివరంజని, ఆర్.ఏసమ్మ, జి.ఝాన్సీ, జి.వెంకటలక్ష్మి, బి.రాజేశ్వరి, బి.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ఆకివీడు : అంగన్‌వాడీ కార్మికులను బెదిరించే విధానం మానుకోవాలని ఎంఎల్‌ఎ మంతెన రామరాజు హితవు పలికారు. సమ్మె శిబిరాలను ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. ముందుగా సిఐటియు నాయకులు కె.తవిటినాయుడు మాట్లాడారు. ఎంఎల్‌ఎ వెంట టిడిపి మండల అధ్యక్షులు మోటుపల్లి ప్రసాద్, గంధం ఉమా సత్యనారాయణ, ఎన్.రామారావు, కె.అరుణ, బి.సరళ, కె.మరియమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

అస్వస్థతకు గురైన ఆయాను పరీక్షిస్తున్న డాక్టర్

అంగన్‌వాడీ హెల్పర్‌కు అస్వస్థత

ఉండి : తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె కొనసాగింది. సమ్మెలో పాల్గొన్న పాందువ్వ గ్రామానికి చెందిన అంగన్‌వాడీ హెల్పర్ కె.లక్ష్మి అస్వస్థతకు గురవ్వడంతో సిఐటియు మండల అధ్యక్షులు ధనికొండ శ్రీనివాస్ పిహెచ్‌సికి సమాచారం అందించారు. స్పందించిన వైద్యులు బి.సాయిచంద్ర దీక్షా శిబిరానికి వచ్చి అస్వస్థతకు గురైన అంగన్‌వాడీ హెల్పర్ కె.లక్ష్మికి ప్రథమ చికిత్స చేసి ఆసుపత్రికి తరలించారు.

అంగన్‌వాడీ కార్యకర్తకు గాయాలు..

ఆచంట : మోటార్ సైకిల్ అదుపుతప్పి అంగన్‌వాడీ కార్యకర్తకు గాయాలయ్యాయి. ఆచంట వేమవరం పంచాయతీ పరిధి పడమటిపాలెం గ్రామానికి చెందిన కడలి మోజారాణి బుధవారం ఉదయం ఆచంట కచేరీ సెంటర్లో సమ్మెలో పాల్గొనేందుకు ఇంటి నుంచి మోటార్ సైకిల్‌పై వస్తుండగా ఆచంట వేమవరం సమీపంలో అదుపుతప్పి కింద పడిపోయింది. దీంతో ఆమెకు గాయాలయ్యాయి. స్థానిక పిహెచ్‌సిలో చేర్పించగా ఎడమ కాలు రెండు చోట్ల విరిగినట్లు డాక్టర్లు తెలిపారు. దీంతో మెరుగైన చికిత్స నిమిత్తం పాలకొల్లు ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి డాక్టర్లు ఆపరేషన్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. అంగన్‌వాడీలు మైలే విజయలక్ష్మి, అల్లం సత్యవతి, సువర్ణ, మల్లేశ్వరి పెద్దింట్లు, ఆమెను పరామర్శించారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి: సిపిఎం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ సమస్యలు పరిష్కరించి సమ్మె విరమింపజేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నాయకుడిగా పాదయాత్రలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని, 15 రోజులుగా ఆందోళనలు చేస్తుంటే ప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేయడం దారుణమన్నారు. తక్షణం వారికి రూ.26 వేలు వేతనం ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ సమాజానికి మంచి సేవలందిస్తున్నారని తెలిపారు. సమస్యలు పరిష్కరించకుండా బలవంతంగా సమ్మె విరమింపజేయాలని చూస్తే సహించేది లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాల్లో మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులు, విఒఎలు, ఆశాలు, సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు కూడా వారి న్యాయమైన డిమాండ్ల సాధన కోసం పోరాటం చేస్తున్నారని తెలిపారు. తక్షణం వారి సమస్యలను పరిష్కరించాలని బలరాం డిమాండ్ చేశారు. ఈ నెల 29వ తేదీన ట్రేడ్ యూనియన్లు, ప్రజా సంఘాలు ఐక్యంగా అంగన్‌వాడీలు, మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులు, విఒఎలు, ఆశాలు, సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల ఆందోళనకు సంఘీభావంగా ప్రదర్శనలకు, కార్యక్రమాలకు ఇచ్చిన పిలుపునకు సిపిఎం తరపున సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని తెలిపారు.

కాకినాడలో జరుగుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభల్లో పాల్గొన్న పశ్చిమగోదావరి జిల్లా ప్రతినిధులు

సిఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరంలో ఈ నెల 29న సిఎం జగన్ పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో గ్రంధి వెంకటేశ్వరరావు ప్రభుత్వ జూనియర్ కాలేజీ వద్ద బహిరంగ సభ వేదికను ఏర్పాటు చేశారు. ఈ సభ ఏర్పాట్లను రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ బుధవారం పరిశీలించారు. సుమారు 50 వేల మందికి పైగానే హాజరయ్యేలా ఈ బహిరంగ సభ వేదికపై నుంచి సిఎం జగన్ విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయనున్నారు. సిఎం జగన్ పర్యటనను భారీ స్థాయిలో విజయవంతం చేసే దిశగా ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నారు.

డిఆర్ఒకు వినతిపత్రం అందిస్తున్న గణేష్, విఆర్ఎలు

విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

విఆర్ఎల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయంలో డిఆర్ఒ బివిఎస్.నారాయణరెడ్డికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గణేష్ ఆధ్వర్యంలో బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ విఆర్ఎలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. స్కేల్ అమలు చేయాలని, పెంచిన రూ.500 విడుదల చేయాలని, ప్రమోషన్ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విఆర్ఎలు పాల్గొన్నారు.

ఓటర్ నమోదు ప్రక్రియ వేగవంతం

ప్రజాశక్తి - ఉండి

ఓటర్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి, నియోజకవర్గ ప్రత్యేక అధికారి జివికె.మల్లికార్జునరావు అన్నారు. మండలంలోని రాజులరేవు కూనపరాజు అప్పలరాజు సీతమ్మ లయన్స్ ఆడిటోరియంలో నియోజకవర్గస్థాయి బూత్ లెవెల్ అధికారుల సమీక్ష సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జునరావు మాట్లాడుతూ నూతన ఓటర్లను, చిరునామా మార్పు, తొలగింపులు, చేర్పులు వంటివాటి గడువు తేదీ సమీపించడంతో వీటి ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి బూత్ లెవెల్ అధికారి, బూత్ లెవెల్ అసిస్టెంట్‌తో సమన్వయం చేసుకుంటూ ఈ ప్రక్రియ సులభతరం అవుతుందని తెలిపారు. ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఓటర్ నమోదు, పరిశీలనలలో అవకతవకలు లేకుండా చూసుకోవాలని నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సూర్యనారాయణ సేవలు మరువలేనివి

ప్రజాశక్తి - పాలకొల్లు

వ్యాపారంలోనే కాకుండా సేవా రంగాల్లో అత్యధిక సమయం కేటాయించిన అజాత శత్రువు కీర్తిశేషులు రేపూరి సూర్యనారాయణ అని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు చెప్పారు. స్థానికంగా బుధవారం నిర్వహించిన పాలకొల్లు ఛాంబర్ అధ్యక్షులు రేపూరి సూర్యనారాయణ సంస్మరణ సభలో ఎంఎల్ఎ మాట్లాడారు. పాలకొల్లులో ఇటీవల నిర్మించిన టిటిడి, అన్నవరం ఉత్సవ విగ్రహాల కళ్యాణోత్సవం ఘనంగా జరగడానికి సూర్యనారాయణ చేసిన సేవ మరువలేనిదని చెప్పారు. ఆయన కుటుంబ సభ్యులకు ఛాంబర్ సభ్యులు జక్కంపూడి కుమార్, ధనాని సూర్యప్రకాష్, చవాకుల నరేష్‌లు సానుభూతి తెలిపారు.

భూహక్కు చట్టాన్ని రద్దు చేయాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన భూహక్కు చట్టాన్ని రద్దు చేయాలని భీమవరం లాయర్స్ అసోసియేషన్ తరఫున చేస్తున్న రిలే నిరాహార దీక్షకు జనసేన పార్టీ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షులు, భీమవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి కొటికలపూడి గోవిందరావు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, పట్టణ అధ్యక్షులు చెనమల్ల చంద్రశేఖర్, పట్టణ ప్రధాన కార్యదర్శి సుంకర రవి, నాయకులు బండి రమేష్ కుమార్, భీమవరం మండల అధ్యక్షులు మోకా శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి కత్తుల నీలేంద్ర పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - ఆచంట

ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా కొడమంచిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న క్రీడా పోటీలను మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు సుంకర సీతారామ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వం ఇటువంటి క్రీడలు నిర్వహించడం అభినందనీయమన్నారు. గ్రామీణ స్థాయిలో క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభ వెలికి తీయడానికి ఇటువంటి క్రీడలు ఎంతో ఉపయోగపడతాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం చిరంజీవి, కార్యదర్శి డి.నాని, గోవర్ధన్, సచివాలయం సిబ్బంది, వైసిపి నాయకులు మన్నె రవికుమార్, పోలిశెట్టి వనమారాజు, రొక్కల రాజకుమార్ పాల్గొన్నారు.

'వైసిపి హయాంలో దళితుల పథకాలు రద్దు'

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

దళితుల సంక్షేమానికి సంబంధించిన 27 పథకాలు వైసిపి హయాంలో రద్దయ్యాయని టిడిపి, జనసేన ఎస్సి నాయకులు ప్రచారం నిర్వహించారు. మండలంలోని శివదేవునిచిక్కాల, హరిజన పేట, జొన్నలగరువు ప్రాంతాల్లో నాయకులు ఇంటింటికీ తిరిగి వైసిపి ప్రభుత్వంలో దళితులకు ఏ విధంగా మోసపోయారో దగా పద్ధతిలో వివరించే కరపత్రాలను పంచారు. ఈ కార్యక్రమంలో తిరుమలరాజు ఆదాం, దాసరి రత్నం రాజు, వినోద్, ముత్యాలరావు దొరబాబు, మట్ల చంద్రశేఖర్, తోట రామకృష్ణ, హైజాక్, ఉసురుపాటి నాగచంద్, పసుపులేటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

దళితుల భూములు ఆక్రమించుకోవడం దారుణం

ప్రజాశక్తి - మొగల్తూరు

దళితుల భూములను అగ్రవర్ణాల నాయకులు ఆక్రమించడం దారుణమని పివి.రావు మాల మహానాడు జాతీయ అధ్యక్షులు గుమ్మపు సూర్యప్రసాద్ అన్నారు. మండలంలోని పేరుపాలెంలో ఏటిమొండి ప్రాంతంలో ఆక్రమణకు గురైన భూమిని ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో దళితులకు ఇంజేటి శ్రీరాములు, మెట్టి నరసింహారావు సాగు చేసుకుంటున్న సుమారు రెండెకరాల భూమిని, మరికొంతమంది దళితులు సాగు చేసుకుంటున్న ఐదు ఎకరాల భూమిని అగ్రవర్ణ నాయకులు దౌర్జన్యంగా ఆక్రమించుకుంటున్నారని ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ప్రజా ప్రతినిధులు కూడా పట్టించుకోవడం లేదన్నారు. అధికారులు స్పందించకపోతే ఎస్సి కమిషన్ ఛైర్మన్ మారుమూడి విక్టర్‌ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం కోరతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సి, ఎస్టి మానిటరింగ్ జిల్లా కమిటీ సభ్యులు పొన్నమండ బాలకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి కొర్రపాటి వీరాస్వామి, గోడి పెద్దిరాజు, జిల్లా మీడియా అధ్యక్షుడు దేవా రాజేష్ కుమార్, పాలకొల్లు నియోజకవర్గ ఉపాధ్యక్షుడు బుంగా జయరాజు పాల్గొన్నారు.

పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఆర్థిక బకాయిలు చెల్లించాలి

యుటిఎఫ్ ఆధ్వర్యాన ఆరు గంటల ధర్నాలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం ఐదు గంటల నుంచి 11 గంటల వరకు ఆరు గంటల ధర్నా స్థానిక యుటిఎఫ్ కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా బి.గోపీమూర్తి మాట్లాడుతూ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పిఆర్‌సి, డిఎ, మెడికల్ రీయంబర్స్‌మెంట్, జిఎల్ఐ పిఎఫ్, సరెండర్ లీవ్ బకాయిలు రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.18 వేల కోట్లు ఉన్నాయన్నారు. ప్రభుత్వం తక్షణమే నిధుల విడుదలకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బకాయిలను వెంటనే చెల్లించాలని, లేకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. జనవరి మూడో తేదీన అన్ని జిల్లా కేంద్రాల్లో 12 గంటల ధర్నా, 9, 10వ తేదీల్లో విజయవాడలో 36 గంటల ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్, సిఐటియు జిల్లా అధ్యక్షులు బి.వాసుదేవరావు మద్దతు తెలిపారు. ఈ ధర్నాలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు, కోశాధికారి సిహెచ్.పట్టాభిరామయ్య, జిల్లా కార్యదర్శులు కె.రామకృష్ణప్రసాద్, పికెఎస్‌సిహెచ్.సాయిరాం, డి.ఏసుబాబు, సిహెచ్.కుమార్, బాబ్జి, రాష్ట్ర కౌన్సిలర్ బిజెవిడి రాజ్యలక్ష్మి, మండల బాధ్యులు కె.త్రిమూర్తులు, పివి.రమణరాజు, బి.నాగబాబు, ఎస్.గోవింద్, కెకె.మల్లేశ్వరరావు, బిఆర్.అంబేద్కర్‌స్వామి, ఎం.శంకర్, సత్యనారాయణ, రామకృష్ణ పాల్గొన్నారు.

తణుకు రూరల్ : ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు ఇవ్వడంతో పాటు పిఎఫ్, ఎపిజిఎల్ఐ, డిఎల బకాయిలు విడుదల చేయాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి టిజె.జయకుమార్ డిమాండ్ చేశారు. స్థానిక కోర్టు వద్ద యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జయకుమార్ మాట్లాడుతూ ప్రతి నెలా 17వ తేదీ వరకు జీతాల కోసం, పెన్షన్ల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. బకాయిలు వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి వి.సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : నిరసన తెలుపుతున్న నేతలు

పాలకొల్లు : తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నేతలు

ఆచంట (పెనుమంట్ర) : మార్టేరు సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా, సాయంత్రం శాంతియుత నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.శ్రీనుబాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ పెనుమంట్ర అధ్యక్షులు సాయిరెడ్డి, ప్రధాన కార్యదర్శి బిఎన్‌వి.సత్యనారాయణ, ఆచంట అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అరుణ్‌కుమార్, కాశీవిశ్వనాథం, పెనుగొండ ప్రధాన కార్యదర్శులు జి.శ్రీనివాస్, ఎస్.విశ్వనాథం, బండి ప్రసాద్ పాల్గొన్నారు.

పాలకొల్లు : పాలకొల్లు తహశీల్దార్ కార్యాలయం వద్ద యుటిఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనంతరం డిటికి వినతిపత్రం అందించారు. ధర్నాకు యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జి.లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం హాజరయ్యారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దండు పద్మావతి, రాష్ట్ర పూర్వ కార్యదర్శి సరిపల్లి జయప్రభ, జిల్లా కార్యదర్శి పి.క్రాంతికుమార్, రాష్ట్ర కౌన్సిలర్లు ఎంవి.రాజశేఖర్, పిల్లి శ్రీనివాస్, నాయకులు శ్రీనివాసరావు, పంతం రామ్మూర్తినాయుడు, ఎస్.రాంజీకుమార్, కె.త్రినాథ్, జి.ప్రకాష్‌రావు, నాగరాజు, సిఐటియు నాయకులు దేవ సుధాకర్ పాల్గొన్నారు.

నరసాపురం టౌన్ : స్థానిక తహశీల్దార్ ఎమ్‌డి.ఫాజిల్‌కు యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు మార్కండేయులు ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మార్కండేయులు మాట్లాడుతూ ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని, పిఆర్‌సి, డిఎ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి.కృష్ణ కుమారి, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు జిఎస్-ఎస్ఆర్.స్వామి, పి.శ్రీనివాస్, మండలాధ్యక్షులు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఎస్.అజయ్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు కె.మాణిక్యాలరావు, చంద్రకుమార్, మొగల్తూరు అధ్యక్షుడు సిహెచ్.కృష్ణమోహన్, సిహెచ్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

తణుకు రూరల్ : నిరసన తెలుపుతున్న నేతలు

పరిశోధనల్లో కొత్త శిఖరాలను అధిరోహించాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

విద్యార్థులు నూతన పరిశోధనలను చేపట్టి కొత్త శిఖరాలను అధిరోహించాలని సెర్బ్ ప్రిన్సిపల్ ఇన్వెస్ట్ గేటర్ డాక్టర్ కర్రి ఫణికృష్ణ తెలిపారు. ఎపి నిట్‌లోని ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం, సెర్బ్ సంయుక్త ఆధ్వర్యంలో సైంటిఫిక్ సోషల్ రెస్పాన్సిబులిటీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించాయి. ఈ కార్యక్రమానికి తాడేపల్లిగూడెం మహతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు హాజరై సెర్బ్ ప్రాజెక్టును పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఫణికృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు తమ బంగారు భవిష్యత్తుకు పాఠశాల స్థాయిలోనే పునాది వేసుకోవాలని చెప్పారు. చదువు, ఆధునిక సాంకేతికతతో పాటు అదనంగా మరిన్ని నైపుణ్యాలను నేర్చుకుని వాటిపై పట్టు సాధిస్తే విజయ శిఖరాలను సులువుగా చేరుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు డాక్టర్ వి.సందీప్, డాక్టర్ టి.రమేష్, డాక్టర్ పి.శంకర్, డాక్టర్ కిరణ్ పాల్గొన్నారు.

తెలుగు మహాసభల జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - పాలకొల్లు

తెలుగు సంస్కృతీ, సాంప్రదాయాలు, భాషలను కాపాడుకునేలా నిర్వహించే అంతర్జాతీయ తెలుగు మహాసభలను జయప్రదం చేయాలని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు అన్నారు. ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించే తెలుగు మహాసభల ఆహ్వానపత్రికను ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడుకు ఆయన క్యాంపు కార్యాలయంలో బుధవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో జనవరి 5, 6, 7 తేదీల్లో నిర్వహించే తెలుగు మహాసభలో తెలుగు భాషాభిమానులు పాల్గొనాలని కోరారు. పాలకొల్లు ముద్దుబిడ్డ డాక్టర్ గజల్ శ్రీనివాస్, చైతన్య విద్యా వైద్య సంస్థల అధినేత చైతన్యరాజు సంయుక్త నేతృత్వంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు కెసిహెచ్.పెద్దిరాజు, యర్రంశెట్టి వెంకట రత్నం నాయుడు, చేగొండి రంగారావు, బొల్లాల వాసు పాల్గొన్నారు.

వాటర్‌ట్యాంకు నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - ఆచంట (పెనుమంట్ర)

మార్టేరులో జలజీవన్ మిషన్ నిధులు రూ.88 లక్షలతో నిర్మిస్తున్న హెచ్‌ఒఆర్ఎస్ (వాటర్ హెడ్ ట్యాంక్) పనులకు ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు బుధవారం శంకుస్థాపన చేశారు. అనంతరం మార్టేరు ఎస్‌విజిహెచ్ హైస్కూల్ గ్రౌండ్‌లో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఎనిమిదో తరగతి విద్యార్థులకు బైజూస్ ట్యాబ్‌లు పంపిణీ చేశారు. రూ.21.8 లక్షల జెడ్‌పి నిధులతో నిర్మించిన కాంపౌండ్ హాలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి మట్టా కుమారి, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ గుబ్బల తమ్మయ్య, జాతీయ, అంతర్జాతీయ డబుల్ ఒలంపియన్ క్రీడాకారిణి సత్తి గీత, ఇంటర్నేషనల్ బాస్కెట్‌బాల్ ప్లేయర్ సత్తి సుబ్బన్నరెడ్డి, ఎంపిపి కర్రి వెంకటనారాయణరెడ్డి (వాసు రెడ్డి), జెడ్‌పిటిసి సభ్యులు కర్రి గౌరీసుభాషిణి, ఎంపిటిసి సభ్యులు కర్రి అనురాధ, గుడిమెట్ల లక్ష్మణరెడ్డి, అధికారులు, వివిధ హోదా ప్రజా ప్రతినిధులు, నాయకులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ల గోడౌన్ తొలగించాలని ధర్నా

ప్రజాశక్తి - భీమవరం రూరల్

నిబంధనలకు విరుద్ధంగా ఉండి యానాదుల కాలనీలో జనావాసాల మధ్య ఉన్న ఇండేన్ గ్యాస్ సిలిండర్ల గోడౌన్‌ను తక్షణమే తొలగించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. తమ జనావాసాల మధ్య ఉన్న గ్యాస్ సిలిండర్ల గోడౌన్ తొలగించాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యంలో భీమవరం కలెక్టరేట్ వద్ద ఉండి గ్రామానికి చెందిన యానాదుల కాలనీ వాసులు బుధవారం ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి సరోజినికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ గ్యాస్ ఏజెన్సీ యజమాని అక్కడ స్థానికులతో బిస్కెట్ల కంపెనీ నిర్మిస్తున్నామని నమ్మబలికి గ్యాస్ సిలిండర్ల గోడౌన్ నిర్మించారన్నారు. గ్యాస్ సిలిండర్లతో భారీ వాహనాలు వెళుతున్న సమయంలో నిత్యం కరెంట్ తీగలు తెగిపోయి ప్రమాదకర పరిస్థితులు నెలకొంటున్నాయన్నారు. ప్రజల భద్రత దృష్ట్యా తక్షణమే జనావాసాల మధ్య ఉన్న ఇండేన్ గ్యాస్ సిలిండర్ల గోడౌన్ తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కలిశెట్టి వెంకట్రావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.సీతారాంప్రసాద్, పార్టీ నాయకులు దొమ్మేటి నాగరాజు, అద్దూరి పోలయ్య, నీలవేణి, సరోజిని, రమణమ్మ పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - ఆచంట

చెత్త నుంచి సంపద సృష్టించి పంచాయతీలకు ఆదాయాన్ని సమకూర్చేలా సంపద కేంద్రాలు ఏర్పాటు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్ డిమాండ్ చేశారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో పరువు మోహన్‌రావు అధ్యక్షతన బుధవారం నిర్వహించిన శాఖ సమావేశంలో గోపాలన్ మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలో వర్మీ కంపోస్ట్ యార్డులు లేకపోవడంతో రహదారుల పక్కనే చెత్త కుప్పలు కుప్పలుగా పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతుందన్నారు. దీంతో దోమలు పెరిగిపోయి అనేక అంటు రోగాలు ప్రబలుతున్నాయన్నారు. డంపింగ్‌యార్డులపై అధికారులు క్షేత్రస్థాయిలో అధికారులు సరైన దృష్టి సారించకపోవడంతో కేవలం షెడ్ల నిర్మాణంతోనే కథ కంచికి చేరిందన్నారు. మరో పక్క గ్రామాల్లో సేకరించిన చెత్త వ్యర్థాలను కేంద్రాల వద్ద కుప్పలుగా పోయడంతో పారిశుధ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. ఈ తరహాలో చెత్త వ్యర్థాలు కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లడంతో ప్రయాణికులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. నియోజకవర్గంలో సుమారు రూ.మూడు కోట్ల వరకు సంపద కేంద్రాల నిర్మాణానికి వెచ్చించారని, ఇప్పటివరకు ఎక్కడా పైసా సంపాదన లేకపోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రస్తుతం కేంద్రాలు చెత్త కుప్పలుగా మారిపోవడంతో ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారన్నారు. తక్షణమే అధికారులు స్పందించి పారిశుధ్య సమస్యలు దృష్టిలో పెట్టుకుని రహదారుల వద్ద కుప్పలుగా పేరుకుపోయిన చెత్త వ్యర్థాలను తొలగించి డంపింగ్ యార్డును అందుబాటులోకి తీసుకురావాలని, లేకపోతే సిపిఎం తరపున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం శాఖ కార్యదర్శి ఎస్‌విఎన్.శర్మ, వద్దిపర్తి అంజిబాబు, తోటపల్లి సత్యనారాయణ, వద్దిపర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కార్మికుని మృతిపై విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి - తణుకు రూరల్

తణుకులోని శ్రీ సత్యనారాయణ స్పిన్నింగ్ మిల్లు యాజమాన్యం వల్ల ఆత్మహత్య చేసుకున్న ఈరి లక్ష్మణ్ (24) మృతిపై విచారణ జరిపించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్, మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.ఆదినారాయణబాబు, గుబ్బల గోపీ, డిమాండ్ చేశారు. స్థానిక స్పిన్నింగ్ మిల్లు వద్ద బుధవారం జరిగిన ఆందోళనకు సిఐటియు సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిల్లు యాజమాన్యం ద్వారా నియమించిన సూపర్‌వైజర్ నోటికొచ్చినట్లు తిట్టడం వల్ల లక్ష్మణ్ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడన్నారు. కార్మికుడు లక్ష్మణ్‌ని యాజమాన్యం మానసికంగా వేధించడం వల్ల పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడన్నారు. కార్మికుడి కుటుంబాన్ని అన్నివిధాలుగా ఆదుకోవాలని, కారకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళన చేపడతామని ప్రతాప్ హెచ్చరించారు. పరిశ్రమ వద్ద జరిగిన ఆందోళన చర్చలో కామన మునిస్వామి, గార రంగారావు పాల్గొన్నారు.

కేసు నమోదు

సూపర్‌వైజర్ దుర్భాషలాడడంతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన లక్ష్మణ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇరగవరం హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా సంక్షేమానికి పెద్దపీట : పివిఎల్

ప్రజాశక్తి - కాళ్ల

వైసిపి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు అన్నారు. మండలంలోని పెదఅమిరంలో ఎన్ఆర్ఇజిఎస్ నిధులు రూ.10 లక్షలతో సీసీ రోడ్డు, గ్రామ పంచాయితీ సహాయ నిధులు సుమారు రూ.3.75 లక్షలతో కల్వర్టు, రూ.4 లక్షలతో సీసీ డ్రెయినేజీ మొత్తం రూ.17.75 లక్షలతో అభివృద్ధి పనులకు ఆయన బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పివిఎల్.నరసింహరాజు మాట్లాడుతూ సిఎం జగన్ పాలనలోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి డొక్కు సోమేశ్వరరావు, ఉప సర్పంచి జవ్వాది లీలా కిషోర్, ఎంపిపి శిరీష విశ్వనాథరాజు, జెడ్‌పిటిసి సభ్యులు సోమేశ్వరరావు, కోపల్లె సొసైటీ ఛైర్మన్ వేగేశ్న జయరామకృష్ణంరాజు, బిరుదుగడ్డ రమేష్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న పివిఎల్.నరసింహరాజు

27 నుంచి ఇంటింటా సర్వే

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

ఈ నెల 27వ తేదీ నుంచి జనవరి 12వ తేదీ వరకు ఇంటింటికి వెళ్లి లెప్రసి వ్యాధిపై సర్వే చేయనున్నట్లు డాక్టర్ అడ్డాల ప్రతాప్‌కుమార్ అన్నారు. మండలంలోని లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ ప్రతాప్‌కుమార్ ఆధ్వర్యంలో జాతీయ కుష్టు వ్యాధి నివారణ కార్యక్రమం బ్రోచర్‌ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రతాప్‌కుమార్ మాట్లాడుతూ 2027 సంవత్సరం నాటికి కుష్టు రహిత సమాజంగా మార్చాలనే ఉద్దేశంతో ఈ నెల 27వ తేదీ నుంచి జనవరి 12వ తేదీ వరకు ఇంటింటికి లెప్రసి వ్యాధిపై సర్వే చేయనున్నట్లు తెలిపారు. డిప్యూటీ పారా మెడికల్ అధికారి రాంప్రసాద్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నవ్యజీవన్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, పీహెచ్ఎన్.ఎలిజిబెత్, సూపర్‌వైజర్లు ఎస్‌కె అమలేశ్వరరావు, డి.కమల, ఫార్మాసిస్టు పాటపల్ల స్వామి, కె.సత్తిబాబు, మధుకుమార్, తారకసత్య, దివాకర్ బాబు, గోపాలకృష్ణ, ఎల్‌టి.ప్రసాద్, స్టాఫ్ నర్స్ పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ తాగునీరందించడమే లక్ష్యం

గణపవరం : తన నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ తాగునీరందించడమే లక్ష్యంగా పని చేస్తున్నానని ఎంఎల్ఎ పుప్పాల శ్రీనివాసరావు(వాసుబాబు) అన్నారు. మండలంలోని వల్లూరులో రూ.35 లక్షలతో, అగ్రహార గోపవరంలో రూ.36 లక్షలతో వాటర్ ట్యాంకులు, పైపులైన్ల నిర్మాణానికి ఆయన బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారం చేపట్టిన తర్వాత ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా జలజీవన మిషన్ పథకంలో వివిధ గ్రామాల్లో వాటర్ ట్యాంకులు, పైపులైన్లు ఏర్పాటు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు వేణు మురళి, పాతం శెట్టి పద్మావతి శ్రీనివాస్, జెడ్‌పిటిసి సభ్యులు దేవవరపు సోమలక్ష్మి, ఎంపిపి దండు వెంకటరామరాజు, వైసిపి మండల కన్వీనర్ దండు రాము, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ కె.హరినాథ్‌రాజు పాల్గొన్నారు.

'ఆటో డ్రైవర్ల పొట్ట కొట్టొద్దు'

భీమవరం రూరల్ : రాజకీయ పార్టీలు మహిళలకు ఉచిత ఆర్‌టిసి బస్సు ప్రయాణం పథకం ప్రవేశపెట్టి ఆటో డ్రైవర్ల కుటుంబాల ఉసురు పోసుకోవద్దని ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు ఇంటి సత్యనారాయణ అన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో బుధవారం నిర్వహించిన ఆటో యూనియన్ జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉన్నత చదువులు చదివినప్పటికీ ఉపాధి లేక ఆటో నడుపుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్న తమకు అండగా నిలవాల్సిన రాజకీయ పార్టీలు తమ స్వలాభం కోసం ఎన్నికల మేనిఫెస్టోలో మహిళలకు ఉచిత ఆర్‌టిసి బస్సు ప్రయాణం కల్పిస్తామని ప్రకటించడం దారుణమన్నారు. ఈ సమావేశానికి భీమవరంతో పాటు జిల్లా నలుమూలల నుంచి 70 ఆటో యూనియన్ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పంపన గోపీ, రాంబాబు, వాసు, ఆరేపల్లి బాలాజీ, సంజీవరావు, శామ్యూల్ రాజు, సతీష్, కృష్ణ, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

ఎంఎల్‌హెచ్‌పి, సిహెచ్‌ఒ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

వైద్య శాఖలో ఎంఎల్‌హెచ్‌పి, సిహెచ్‌ఒ పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి.మహేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజమహేంద్రవరం జోన్-2 వారి పరిధిలోని ఎంఎల్‌హెచ్‌పి, సిహెచ్‌ఒ పోస్టులకు నోటిఫికేషన్‌కు సంబంధించిన వివరాలను జోన్-2 పరిధిలోని అన్ని జిల్లా వెబ్ సైట్లలో పొందు పరిచినట్లు చెప్పారు. సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తును జోన్-2 ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకుల కార్యాలయంలో ఈ నెల 28వ తేదీ నుంచి జనవరి 12వ తేదీ లోపు అర్హత గల అభ్యర్థులు అందించాలని తెలిపారు. పూర్తి వివరాలకు eluru.ap.gov.in, west godavari.ap.gov.in, kakinada.ap.gov.in, konaseema.ap.gov.in, krishna.ap.gov.in, ntr.ap.gov.in, eastgodavari.ap.gov.in వెబ్‌సైట్ చూడాలని తెలిపారు.

నేడు కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - ఉండి

ఈ నెల 28వ తేదీన కాంగ్రెస్ పార్టీ 139వ ఆవిర్భావ దినోత్సవానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎంపిపి వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ఆదేశానుసారం ఎపి పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా 139వ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఈ నెల 28వ తేదీన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉండి నియోజకవర్గ స్థాయిలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఉండి పెద్ద వంతెన సెంటర్‌లో ఉన్న కాంగ్రెస్ పార్టీ స్థూపం వద్ద నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొనాలని పేర్కొన్నారు.

మహావృక్షాల నరికివేత సరికాదు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

విద్యా దీవెన పథకం బటన్ నొక్కడానికి భీమవరానికి విచ్చేస్తున్న జగన్ పర్యటన కోసం పూర్వకాలం నాటి మహావృక్షాలను నరికివేసి పర్యావరణాన్ని ముప్పు వాటిల్లేలా చేస్తున్నారని టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి తెలిపారు. టిడిపి కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ భీమవరం పర్యటనకు విచ్చేసిన గత ముఖ్యమంత్రులు, ప్రధాన మంత్రులు భీమవరంలోని రెండు హెలిపాడ్‌లు వాడుకున్నారన్నారు. వారి పర్యటనకు ఎటువంటి చెట్లను నరకలేదన్నారు. రెండు హెలిపాడ్లు ఉండగా లూథరన్ హై స్కూల్ గ్రౌండ్‌లోని మరొక హెలిపాడ్‌ను నిర్మించి, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వంతెనలు, రైల్వే బ్రిడ్జిలకు వైసిపి రంగులు వేసి ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో టిడిపి పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు, గూడూరి సుబ్బారావు, టిడిపి వీరవాసరం మండల అధ్యక్ష, కార్యదర్శులు కొల్లేపర శ్రీనివాస్, వీరవల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

'దళితుల అభ్యున్నతికి కృషి చేయాలి'

మొగల్తూరు : దళితుల అభ్యున్నతికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని పివి.రావు మాల మహానాడు జాతీయ అధ్యక్షులు గుమ్మపు సూర్యప్రసాదరావు అన్నారు. మండలంలోని పేరుపాలెంలోని ఏటిమొండిలో పివి.రావు మాల మహానాడు మొగల్తూరు మండల శాఖ అధ్యక్షుడు ఇంజేటి కుమార్ స్వామి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితుల అభ్యునతి కోసం పివి.రావు మాల మహానాడు నిరంతరం పోరాడుతుందన్నారు. అనంతరం ఎస్‌సి, ఎస్‌టి మానిటరింగ్ జిల్లా కమిటీ సభ్యులు పొన్నమండ బాలకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి కొర్రపాటి వీరాస్వామి, జిల్లా మీడియా అధ్యక్షుడు దేవా రాజేష్‌కుమార్‌లను సంఘ నాయకులు ఘనంగా సత్కరించారు.

మహారాజశ్రీ తణుకు సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
ఐ.ఎ. 1/2023 ఇన్ ఓ.ఎస్.నెం. 7/2021
బిట్వీన్ :
1. కోరా రామారావు&ఇతరులు ...పిటీషనర్లు/వాద్దులు
మరియు
1. గుణ్ణం భాగ్యలక్ష్మి (డైడ్) & ఇతరులు
- రెస్పాండెంట్లు / ప్రతివాద్దులు
ప్రపోజ్డు పార్టీలు:
1). పువ్వాడ సత్యనారాయణ, వేల్పూరు గ్రామం (ఆర్-4)
2). పువ్వాడ సురేష్, s/o. సత్యనారాయణ, వేల్పూరు గ్రామం (ఆర్-5)
వాదుల తరపున దాఖలు చేసిన పేపరు ప్రకటన
పై నెంబరు గ్రంధంలో ప్రతివాద్దు (ప్రపోజ్డు పార్టీలు) అయిన మీకు పై పిటీషన్‌లో నోటీసులు శ్రీ.కోర్టు ద్వారా మరియు రిజిష్టర్డు పోస్టు ద్వారా పలుమార్లు పంపించిననూ, అవి మీరు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున మీరు పై కోర్టు వారి ఎదుట ది.9-1-2024వ సం.రం. తేదీన ఉదయం గం.10-30 ని॥లకు హాజరు కావలెను. మీరు స్వయంగా కానీ మీ తరపు ప్లీడరు గారి ద్వారా గానీ శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై ఆక్షేపణలు ఉన్న యెడల తెలియపర్చుకోవలెను. లేనిచో మీ పరోక్షమున తీర్మానించెదరు అని మీకు పేపరు ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.
తణుకు ఇట్లు
తేది : 26-12-2023
ఇవటూరి కిషోర్
డి.హెచ్.ఆర్.తరపున అడ్వకేట్
సెల్: 98485 44550

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE, ELURU
O.S.No. 114/2021
Between :
Smt. Lakshmipathula Padmavathi - Plaintiff
And
Jakkula Anil Babu & others - Defendants
To
D-2: Jakkula Ashok Babu, S/o. Venkateswara Rao, D.No.16A-6-33A, 50th Division, Tangellamudi, Eluru, Eluru District
D-3: Jakkula Anitha, W/o. Yugandhar, D.No. 16A-6-33A, 50th Division, Tangellamudi, Eluru, Eluru District
పై నెంబరు దావా గ్రంథములో శ్రీ కోర్టు వారు ప్రతివాదులు 2,3 వారల హాజరు నిమిత్తం పలుమార్లు సమన్లు ఆర్డరు వేసినప్పటికీ మీరు తీసుకొనక యాలయాపన చేసినందున మీ యొక్క హాజరు నిమిత్తం ది.2-1-2024వ తేదీన ఉదయం గం.10-30 ని॥లకు వాయిదా వేసియున్నారు. కావున మీరు స్వయంగా గానీ, ప్లీడరు గారి ద్వారా గానీ హాజరు కానీ యెడల మీ పరోక్షమున పై నెంబరు దావా గ్రంథము పరిష్కరింపబడునని తెలియజేయడ మైనది.
// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం //
G.V.Anand Kumar, B.Sc., B.L., Advocate, Eluru, Cell : 9848427001